ప్రజలకు అండగా 'సాక్షి'

నేడు భద్రాచలం ఏఎస్పీతో ఫోన్ – ఇన్



విక్రాంత్ కుమార్ సింగ్

భద్రాచలం అర్బన్: ఇటీవల చోరీ ఘటనలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం దసరా సెలవులు వచ్చాయి. ఇళ్లకు తాళాలు వేసి పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్తుండడంతో చోరీలు పెరిగే అవకాశముంది. చోరీల నివారణతో పాటు పండుగ సమయంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించకుండా కట్టడి చేసేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు సమస్యలను ప్రజలు నేరుగా భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్ ఇన్

ఫోన్ చేయాల్సిన సమయం :

27-09-2025, శనివారం

ఉదయం 11 నుంచి

మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ నంబర్లు :

87126 82004, 83672 32424

ఆటోలు అడ్డు పెడితే చర్యలు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎం సునీత

అశ్వారావుపేటరూరల్: పట్టణ కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఆటోలు అడ్డుగా పెడితే చర్యలు తప్పవని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బస్టాండ్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. కార్గో ఏజెంట్, దుకాణాదారులతో మాట్లాడి నిబంధనలు పాటించాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పి విజయశ్రీ, విలేజ్ బస్ ఆఫీసర్ ఆనందరావు, కంట్రోలర్ ఆర్‌వీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



నగేష్

మణుగూరు రూరల్: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా సీహెచ్ నగేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన మణుగూరు సీఐ పి.నాగబాబును కలిసి మొక్క అందజేశారు. ఈ మేరకు ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

చంద్రుగొండ: మండలపరిధిలోని గుర్రాయిగూడెం రోడ్డు శిథిలావస్థకు మారడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు పెద్దిన్ని వేణు, వెంకటేశ్వర్లు, రాయిరాజా, వీరభద్రం, సీతారాములు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



ర్యాలీలో సీడీపీఓ, అంగన్‌వాడీలు

దమ్మపేట: వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ఆవశ్యకతను ఐసీడీఎస్ సీడీపీఓ హేమసత్య వివరించారు. శుక్రవారం మండలంలో పోషణమాసం కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు వెంకటలక్ష్మి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి: భద్రాచలం నుండి తిమ్మంపేట మీదుగా ములకలపల్లి మండలకేంద్రం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. తిమ్మంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బస్సు రాకపోవడంతో సుమారు 30 గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ మండల కార్యదర్శి రాంబాబు, ఊకంటి రవికుమార్, నాగేశ్వరరావు, అమల, గౌరి లక్ష్మి, రావుల పుల్లయ్య, పుప్పాల హరనాథ్ ఉన్నారు.

పారదర్శకతే లక్ష్యంగా..



లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శులు



ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై జాగ్రత్తలు

- పీఎం ఆవాస్ యోజన యాప్‌తో రీసర్వే, జియో ట్యాగింగ్
- అనర్హులకు చెక్‌పెట్టేలా క్షేత్రస్థాయిలో వివరాల నమోదు

కరకగూడెం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఆశయంతో ఈ పథకం ప్రారంభమైనప్పటికీ, లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నిజమైన పేదలకు న్యాయం చేసేందుకు, పథకం లక్ష్యం నీరుగారకుండా చూసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఆమోదించిన 'ఎల్1' జాబితాలను క్షుణ్ణంగా పునఃపరిశీలిస్తూ అనర్హులను ఏరివేసే ప్రక్రియను ముమ్మరం చేశారు. మండల వ్యాప్తంగా ఎల్1 జాబితాలో 1,880 మందిని అర్హులుగా అధికారులు తేల్చారు.

క్షేత్రస్థాయిలో రీసర్వే

ప్రభుత్వం తొలిదశలో మండల వ్యాప్తంగా 16 పంచాయతీల్లో 408 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. గ్రామసభల ఆమోదంతో సిద్ధం చేసిన 'ఎల్1' జాబితాలపై విస్తృతంగా ఫిర్యాదుల రావడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రతీ లబ్ధిదారుడి ఇంటిని క్షేత్రస్థాయిలో సందర్శించి రీసర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా లబ్ధిదారుడి ఆర్థిక స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ మార్గాలు, వారి పేరు మీద ఉన్న స్థిర, చరాస్తులను కూడా ఆరా తీస్తున్నారు. రీసర్వేలో అనర్హులందరిని గుర్తించి, వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఆపై గ్రామసభల ముందు, ఆన్‌లైన్‌లో జాబితా పొందుపరిచి ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తారు.

సాంకేతికతను వినియోగిస్తూ..



లబ్ధిదారురాలి ఫొటో నమోదు చేస్తూ..

ఎంపిక ప్రక్రియలో పారదర్శకత తీసుకొచ్చేందుకు అధికారులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'పీఎం ఆవాస్ యోజన' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ యాప్‌తో ప్రతీ దరఖాస్తుదారుడి ఐరిస్, ఇంటిని లేదా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశాన్ని జియోట్యాగింగ్‌తో సహా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా, ఉపాధి హామీ కూలీ అయితే జాబ్ కార్డు వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. దీనివల్ల లబ్ధిదారుడి వాస్తవ నివాస పరిస్థితి స్పష్టంగా రికార్డవుతుంది. గతంలో కొందరు పాత గుడిసెలను, అద్దె ఇళ్లను చూపించి పథకానికి దరఖాస్తు చేసుకున్న సందర్భాలున్నాయి. కానీ జియోట్యాగింగ్‌తో లొకేషన్‌ను కచ్చితంగా నిర్ధారించడం వల్ల ఇలాంటి మోసాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతోంది.

గూడు దొరుకుతుందని ఆశ..



కూలి పని చేసుకుని బతికే మాకు సొంత ఇల్లు అనేది జీవితకాలపు కల. తొలి విడతలో మాకు ఇల్లు మంజూరు కాలేదు, ఈసారైనా ఓ గూడు దొరుకుతుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు అధికారులు మళ్లీ ఇంటింటికీ వచ్చి విచారణ చేస్తుంటే మాలో కాస్త ఆశ మొదలైంది.

– మన్యం సురేష్, కరకగూడెం

ఎంపిక అత్యంత పారదర్శకంగా..



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నప్పుడు కొందరు తప్పుడు సమాచారం ఇచ్చి పథకాన్ని పొందాలని చూస్తారు. అందుకే టెక్నాలజీతో జియోట్యాగింగ్ యాప్‌తో వాస్తవ పరిస్థితిని నేరుగా రికార్డు చేస్తున్నాం.

– మారుతీ యాదవ్, ఎంపీఓ కరకగూడెం

సొంతింటి కల నెరవేర్చింది కాంగ్రెస్సే..

- ఎమ్మెల్యేలు తెల్లం, పాయం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం



పినపాక: పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాచలంటౌన్: ఇళ్లు కట్టుకోవాలనే ప్రతీ పేదవాడి సొంతింటి కళను నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలో శుక్రవారం పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన ముస్లిం మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ బొగ్గా నారాయణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులకు అందచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 408 మందికి పట్టాలు అందజేయగా ఎంపీడీఓ వివేక్‌రామ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదవాడి కల: ఎమ్మెల్యే పాయం

పినపాక: పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ నందు జీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పినపాక నియోజకవర్గానికి 3,500 ఇళ్లు సరిపోవని అదనంగా మరొక 1,000 కావాలని మంత్రి పొంగులేటిని కోరగా తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి మంజూరు చేశారన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సునిల్‌కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ వినీత, ఏఈ వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ దుర్గాభవాని, ఎఫ్‌ఆర్‌ఓ తేజస్విని, ఏపీఓ వీరభద్రస్వామి, ఇరిగేషన్ ఏఈ నరేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామనాథం, నాయకులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సమితిసింగారంలో నాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

చెక్కుల పంపిణీ

ములకలపల్లి: మండలంలోని తొమ్మిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారం సుధీర్, నాయకులు గాడి తిరుపతి రెడ్డి, పాలకర్తి సుమిత్, భాస్కరిణి అయ్యప్ప, కటికనేని ఆదిత్య, బాబి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల అసమర్థతతోనే రోడ్డు ధ్వంసం



భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్/దుమ్ముగూడెం/చర్ల: ఇసుకాసురుల అత్యాశకు స్థానిక ప్రజాప్రతినిధుల అసమర్థత తోడవడంతో భద్రాచలం ఉంచి వాజేడు వరకు జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసమైందని జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ నెల 29న సీపీఎం ఆధ్వర్యంలో లక్ష్మీనగరం నుంచి భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం భద్రాచలం పట్టణంలో, దుమ్ముగూడెం మండలంలోని రామారావుపేటలో సమావేశాలు ఏర్పాటుచేశారు. అదేవిధంగా చర్లలో దెబ్బతిన్న రోడ్లు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీల కారణంగా రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. భద్రాచలంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, బండారు శరత్‌బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.సీతాలక్ష్మి, సంతోష్‌కుమార్, దుమ్ముగూడెంలో సోయం పార్వతి, పుల్లయ్య, వంశీకృష్ణ, చంద్రయ్య, లోకేశ్‌బాబు, సోడే రాంబాబు, వర్స చిన్నరావు, శ్రీనివాస్‌రావు, వీరస్వామి, చర్లలో పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు, కారం నరేష్, చంటి, తాటి నాగమణి, శ్యామల చంద్రం, వరలక్ష్మి, ముత్తయ్య, కాంతయ్య పాల్గొన్నారు.

లాభాల వాటా పెంచాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మణుగూరు రూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు ఉత్పత్తి లక్ష్యాలకు కృషి చేస్తున్నారన్నారు. ఆర్.మధుసూదన్‌రెడ్డి, గద్దల శ్రీనివాస్, బ్రహ్మాచారి, సంజీవరెడ్డి, సాంబశివరావు, రాయల ప్రసాద్, ఇమామ్‌బీ, నవీన్, గట్టమ్మ, లక్ష్మయ్య, కృష్ణయ్య, రాములు, రాజిరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చర్ల: మండలంలోని లింగాపురంపాడుకు చెందిన క్రీడాకారుడికి 'మేమున్నాం మీ కోసం సహాయక కమిటీ' ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. లింగాపురంపాడుకు చెందిన షేక్ ముబీన్ షాట్‌పుట్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండగా కమిటీ ఆధ్వర్యంలో రూ.14,600 అందజేశారు. కమిటీ చైర్మన్ నీలి ప్రసాద్, షేక్ షాజాహాన్, రమణ, సూరిబాబు, ప్రసాద్, ప్రభుదాసు ఉన్నారు.

ఐలమ్మ పోరాటస్ఫూర్తి మరువలేనిది



మణుగూరు టౌన్: రజక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తి, త్యాగం మరువలేనిదని పలువురు అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



చర్లలో..



చంద్రుగొండలో..



అశ్వాపురంలో..



బూర్గంపాడు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

మణుగూరు రూరల్: మండలంలోని గుట్టమల్లారం రైతువేదికలో ఉపాధి హామీ పథకం పనులపై 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీల్లో ఏప్రిల్ 2024–మార్చి 25 సంవత్సరానికి గాను చేపట్టిన పనులపై అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలు, ఐకేపీ, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి గురవుతున్న వర్కర్లు

మణుగూరు రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి వర్సా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆశ్రమ పాఠశాలల ఎదుట వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరింది. ఈ మేరకు సమ్మె శిబిరాన్ని తుడుందెబ్బ నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. కొమరం సైదులు, మడకం శ్రీను, ఆశ్రమ పాఠశాల వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పర్యవేక్షిస్తుండాలి

చర్ల: విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులు కూడా పర్యవేక్షిస్తూ ఉండాలని చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.



దుమ్ముగూడెం: బతుకమ్మలతో విద్యార్థినులు

దుమ్ముగూడెం: కళాశాలలోని విద్యార్థుల భద్రత కోసం కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నట్టు దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు కళాశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా నీట్, ఎంసెట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తున్నామన్నారు. అనంతరం బతుకమ్మ ఉత్సవాలను ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పోస్టర్లు ఆవిష్కరణ

చర్ల: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న భద్రాచలంలో నిర్వహించనున్న ధర్మయుద్ధం కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం గిరిజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. నాయకులు సోయం రాజారావు, గొంది ముయ్యన్న ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: ధర్మయుద్ధం మహాసభ పోస్టర్లను ఆదివాసీ కొండరెడ్ల సంఘం, జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముర్ల రమేష్, చిప్పల కొమ్మిరెడ్డి, దుర్గారెడ్డి, చంటిరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, శివశంకర ప్రసాద్, రాజాబాబు, దుర్గారావు ఉన్నారు.

ఆలయ భూమిని కాపాడాలి

బూర్గంపాడు: సారపాక పంచాయతీలోని రాజీవ్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రాజీవ్‌నగర్ వాసులు శుక్రవారం ఆంజనేయస్వామి గుడి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు ఓ గిరిజన మహిళను అడ్డుపెట్టుకుని ఆలయ భూమిని ఆక్రమించి రేకుల షెడ్డు వేశారన్నారు. ఆలయ ప్రాంగణంలో గతంలో యజ్ఞయాగాలు చేశారని, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా ఉన్నాయన్నారు. కబ్జాను అడ్డుటకున్న వారిని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.